నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, సోమవారం 8 ఏప్రిల్ 2024 SANGAREDDY

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

టేక్మాల్, ఏప్రిల్ 7: రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీక అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని షాహెదుల్ల దర్గాలో మండల కో ఆప్షన్ సభ్యుడు మజహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఉపవాసాలు చేపట్టిన ముస్లింలతో దీక్షలు విరమింపజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేశ్, నాయకులు మాన్ కిషన్, పాపయ్య, సాగర్, భక్తుల కిశోర్, అనిల్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.




సిద్దిపేటలో ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్

# జీవితాంతం ప్రజాసేవ చేస్తా

- పేదవారికి సేవలందించడమే లక్ష్యం
- సిద్దిపేట తెలంగాణకే ఆదర్శం
- గంగా, జమున తెహజీబ్‌కు సిద్దిపేట కేంద్ర బిందువు
- అధికారం ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తాం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 7: జీవితాంతం ప్రజా సేవలో ఉంటానని, పేదవారికి సేవలందించడమే తన ముఖ్య లక్ష్యమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తెలిపారు. ఆదివారం సిద్దిపేటలోని లిమ్రా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట గంగా జమున తెహజీబ్‌కు కేంద్ర బిందువన్నారు. నాటి ఎమ్మెల్యేలు మదన్‌మోహన్, కేసీఆర్ కాలం నుంచే ఇక్కడి ప్రజలు సోదరాభావంతో కలిసి మెలిసి ఉంటారన్నారు. సిద్దిపేట అన్ని రంగాల్లో రాష్ర్టానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ఆఖరి సఫర్ అనే అంతిమ యాత్ర వాహనాన్ని సిద్దిపేటలోనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మృత దేహాలను భద్రపర్చడానికి అన్ని మసీదుల్లో బాడీ ఫ్రీజర్లను అందుబాటులో ఉంచామన్నారు. సొంత డబ్బుతో సిద్దిపేట ముస్లింల కోసం ఎన్సాన్‌పల్లిలో మూడెకరాల భూమిని కొనిచ్చి, బోరుమోటర్ వేసి, ఫెన్సింగ్ చేసి, గేటు పెట్టి ఇచ్చానన్నారు. నేడు ఆ భూమికి కోట్ల విలువ వచ్చిందన్నారు. సిద్దిపేటలోని అన్ని దర్గా, మసీద్, ఖబ్రస్తాన్‌ల నిర్మాణాలు, మరమ్మతులకు ప్రత్యేకంగా నిధులు ఇచ్చానన్నారు. ఇమామ్, మౌజన్లకు జీతభత్యాలు అందించామన్నారు. ప్రభుత్వంలో ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తామన్నారు. నిరుపేద ముస్లిం మహిళలు ఉపాధి పొందాలన్న లక్ష్యంతో సొంతంగా కుట్టుమిషన్లు అందించానన్నారు. ఏటా పదిమంది నిరుపేదలకు ఉమ్రా యాత్రకు పంపిస్తున్నట్లు తెలిపారు. బతికున్నంత కాలం ఏటా పంపిస్తూనే ఉంటానన్నారు. ప్రతి రంజాన్‌కు తనతో పాటు ఆర్‌ఆర్ మసాలా సంస్థ సహకారంతో 4 వేల మంది పేద ముస్లింలకు ఉచిత రేషన్ కిట్లు అందిస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే హైదరాబాద్ తర్వాత మొట్టమొదటి హజ్‌హౌస్ నిర్మాణం సిద్దిపేటలోనే చేసుకున్నామని తెలిపారు. మదీనా ఫంక్షన్ హాల్‌కు ప్రత్యేకంగా నిధులు కేటాయించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడంతో పాటు కావాల్సిన సామగ్రిని సమకూర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో పండుగ రోజు నమాజ్ వేళ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సిద్దిపేట మున్సిపాల్ పాలకవర్గం సహకారంతో పూర్తి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మైనార్టీలపై ఉందన్నారు. ఆయన ప్రజల మనిషి.. పేదల బాగు కోసం కష్టపడుతున్నారన్నారు. కేసీఆర్ హయాంలో రంజాన్ తోఫా ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తోఫా బంద్ చేసిందన్నారు. బీఆర్‌ఎస్‌ను గెలిపించి కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫరూక్ హుస్సేన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణశర్మ, తంజీం ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు అబ్దుల్ సమీ, ఆసిఫ్, అబ్దుల్ వహీద్, నయ్యర్‌పటేల్, అక్తర్‌పటేల్, అక్బర్ నవాజ్, బాబు జానీ, అజీజ్, జమ్ము, జావీద్, తహెర్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, నాయకులు పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, వజీరుద్దీన్, ఫక్రుద్దీన్, మోయిస్, అరవింద్‌రెడ్డి, నాగరాజురెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్ ఉన్నారు.



సిద్దిపేటలో ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు



## కేంద్ర బలగాల కవాతు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పాపన్నపేట మండల పరిధిలోని మల్లంపేటలో కేంద్ర దళాలు, పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కవాతు నిర్వహించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

– పాపన్నపేట, ఏప్రిల్ 7

## అసంపూర్తి పనులు.. అవస్థల్లో జనం



చేర్యాలలో డ్రైనేజీ నిర్మాణ పనులు నిలిపివేయడంతో ఏర్పడిన మురుగు గుంట

చేర్యాల, ఏప్రిల్ 7: చేర్యాల పట్టణంలో చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణ పనులతో జనానికి ఇబ్బందులు తప్పడం లేదు. హైవే పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 8 నెలల క్రితం డ్రైనేజీల నిర్మాణం కోసం గుంతల తవ్వారు. గుంతల వద్ద అసంపూర్తి పనులతో అందులో మురుగు చేరి పరిసరాలు దుర్గంధంగా మారి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. హైవే నిర్మాణ పనులు ప్రణాళికా ప్రకారం చేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మున్సిపల్ అధికారులతో పాటు నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సూర్యాపేట-సిరిసిల్ల 365(బీ) రహదారి పనులు చేర్యాల పట్టణంలో కొన్ని నెలలుగా కొనసాగుతున్నాయి. రోడ్డు పనుల్లో భాగంగా మొదటగా కాంట్రాక్టర్ పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా పెద్ద డ్రైనేజీలు నిర్మిస్తున్నాడు. ఇందుకోసం నివాస గృహాలు, దుకాణాల ముందర రెండు వైపులా పెద్దపెద్ద గుంతలు తీస్తున్నాడు. ఈ గుంతలు ఒక్కోచోట ఒక్కో లెక్క తీస్తుండడంతో ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**మురుగు గుంటలుగా నూతన డ్రైనేజీ**

రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న డ్రైనేజీలు మురుగు గుంటలుగా మారాయి. విద్యుత్ స్తంభాలు ఉన్నాయనే సాకుతో కాంట్రాక్టర్ అక్కడక్కడా పనులు చేయకుండా వదిలిపెట్టడంతో ఇండ్లళ్ల నుంచి వచ్చిన నీళ్లతో మురుగు పేరుకుపోయి దోమలు పెరిగాయి. దోమల నివారణకు మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అసంపూర్తి పనులు, డ్రైనేజీల కంపు, దోమలతో పట్టణవాసులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలను వదిలిపెట్టి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నాడు. డ్రైనేజీ నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ కింద పనిచేసేవారికి డబ్బులు ముట్టచెబితే విద్యుత్ స్తంభం ఉన్నప్పటికీ దానిని అనుకుని డ్రైనేజీ నిర్మిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు ఉన్నాయని పనులు నిలిపివేసి మరోచోట పనులు చేస్తుండడం గమనార్హం. మున్సిపల్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కాంగ్రెస్ పాలనలో కరెంటు కష్టాలు



సిద్దిపేట జిల్లా నంగునూరులో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

- కేసీఆర్ కావాలి.. కరెంట్ రావాలి
- ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతా..
- నంగునూరు మండల కార్యకర్తల సమావేశంలో బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 7: "తొమ్మిదేండ్లలో పోని కరెంట్, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎందుకుపోతున్నది.. కేసీఆరే కావాలి, కరెంట్ రావాలి" అని మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం నంగునూరు మండల కేంద్రంలోని శ్రేష్ట ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టర్‌గా ఖ్యాతి ఇచ్చిన ఈ గడ్డే తనకు రాజకీయ జీవితం కూడా ఇవ్వాలని కోరారు. ఈ జిల్లాకు కలెక్టర్‌గా, జాయింట్ కలెక్టర్‌గా పనిచేశానన్నారు. పార్లమెంట్‌లో ఒక మాజీ కలెక్టర్‌గా, మెదక్ ఎంపీగా అడుగుపెట్టే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. కలెక్టర్‌గా పనిచేసే సమయంలో తన దగ్గరికి వచ్చే వాళ్లను తన తోబుట్టువులుగా చూశానని, ఎంతో బాధ్యతాయుతంగా పనిచేశానన్నారు.

### ట్రస్ట్ ద్వారా యువతకు అండగా నిలుస్తా..

తనకు డబ్బు మీద యావలేదని.. పేదలకు సేవ చేయడం మీదనే దృష్టి ఉందని వెంకట్రామిరెడ్డి అన్నారు. తాను చేసే సేవ నా తర్వాత కూడా 50 ఏండ్లు పేరు నిలిచి ఉండాలన్నదే తన ధ్యేయం అన్నారు. తన ఉమ్మడి కుటుంబ సభ్యుల సహకారంతో రూ.100 కోట్లతో ట్రస్ట్ ఏర్పాటు చేసి అండగా ఉంటానన్నారు. యువతకు కోచింగ్ కేంద్రాలు, వృత్తి శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి జాబ్ మేళా వేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. నంగునూరు మండలంలో తనకు భారీ మెజార్టీ వస్తుందని, ఎంపీగా తాను గెలవడం ఖాయమన్నారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన గులాబీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నంగునూరు బీఆర్‌ఎస్ ఇలాఖా అని, సిద్దిపేట నియోజకవర్గంలో నంగునూరు మండలంలో ఎప్పుడూ భారీ మెజార్టీ అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమ, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, నాయకులు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కిష్టారెడ్డి, రాజిరెడ్డి, వేణుగోపాల్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.




హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు



సిద్దిపేటలో నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

## మాల మహానాడు నాయకుల నిరసన

సిద్దిపేట, ఏప్రిల్ 7: రాష్ట్రంలో మూడు ఎంపీ స్థానాలు ఎస్సీ రిజర్వుడు ఉంటే ఒక్క స్థానం కూడా మాలలకు కేటాయించకపోవడం బీజేపీకి మాలలపై ఎంత ద్వేషం ఉందో తెలుసుకోవచ్చని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జంజీరపు ఎల్లేశ్ అన్నారు. మాలలకు బీజేపీ ఒక్క పార్లమెంట్ స్థానాన్ని కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద ఆదివారం మాలమహానాడు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, నర్సింహులు, ఎల్లేశ్, బాబు, సందీప్ పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం లారీ

## 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

రామాయంపేట, ఏప్రిల్ 7: రామాయంపేట జాతీయ రహదారి 44పై వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి గుజరాత్ వెళ్తున్న పీడీఎస్ బియ్యం లారీని పట్టుకున్నట్లు రామాయంపేట ఎస్సై రంజిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆదివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న ఓ లారీని తనిఖీ చేశామన్నారు. ఈ లారీకి ఎలాంటి అనుమతులు లేవని, అందులో 300 క్వింటాళ్ల బియ్యాన్ని తీసుకెళ్తున్నారన్నారు. లారీని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. గుజరాత్ రాష్ర్టానికి చెందిన డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



గంగరేగు చెట్టు ఆవరణలో భక్తుల రద్దీ

## మహాదేవా.. మనసాస్మరామి



మల్లన్న ఆలయంలో అర్చకుల పూజలు

చేర్యాల, ఏప్రిల్ 7: ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. చివరి ఆదివారం అగ్నిగుండాల కార్యక్రమానికి 25 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. డిసెంబర్‌లో ప్రారంభమైన మల్లికార్జునుడి బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది 12 వారాల పాటు కొనసాగాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి క్యూలైన్లో వేచి ఉన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు, చిలుకపట్నం, నజరు పట్నం, మహామండప పట్నాలు వేయించారు. కొంతమంది తలనీలాలు సమర్పించి, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టారు. ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. ఈవో బాలాజీ, కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు శ్రీనివాస్, అల్లం శ్రీనివాస్, దామోదర్, ఏఈవోలు శ్రీనివాస్, శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు శేఖర్, ఒగ్గు పూజారులు సేవలందించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు ఎస్సైలు దామోదర్, నాగరాజు, యునూస్ అలీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎండుతున్న పంటలకు ట్యాంకర్ నీళ్ల తడి

కొమురవెల్లి, ఏప్రిల్ 7: గడిచిన పదేండ్లలో ఎన్నడూ లేనివిధంగా రైతులకు సాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. నీరందక పంటలు ఎండుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు పంటలను కాపాడుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి చెందిన దేశెట్టి కనకయ్య అనే రైతు తనకున్న నాలుగు ఎకరాల్లో ముందుచూపుతో రెండెకరాల్లోనే వరి సాగు చేశారు. ఆ రెండు ఎకరాల్లో సగం పంట ఎండిపోయింది. మిగతా ఎకరం ఎండిపోకుండా రెండు రోజులకోసారి రూ.4వేలు ఖర్చుపెట్టి ఐదు నీళ్ల ట్యాంకర్ల ద్వారా వరి పంటకు తడిపెడుతున్నాడు. కరెంట్ కోతలు, భూగర్భ జలాలు అడుగంటడంతో పంటలకు నీరందని పరిస్థితి ఉందని, దీంతో ట్యాంకర్ల ద్వారా నీరుపెడుతున్నట్లు రైతు దేశెట్టి కనకయ్య తెలిపారు.



ట్యాంకర్ నీటితో పొలాన్ని పారిస్తున్న రైతు కనకయ్య



జంగంపల్లి శివారులో ఎండిన పొలంలో పశువులను కట్టేసిన దృశ్యం

## పంట ఎండె.. మేతగా మారె..

వర్గల్, ఏప్రిల్ 7: తలాపునే కొండపోచమ్మసాగర్ ఉన్నా వర్గల్ మండలంలోని చెరువులు,కుంటలు ఎండిపోయాయి. రామాయిపేట కాలువ, హల్దీవాగు పరీవాహక పరిధిలోని ఒకటి రెండు చెరువులు, కుంటలు మినహా మిగతావి ఇప్పుడే కరవు నేలలను తలపిస్తున్నాయి. మండలంలోని జంగంపల్లి శివారులో సాగునీటిపారుదల శాఖ అధికారుల దృష్టిలోపం, కరెంట్ కోతలు, భూగర్భ జలాలు అడుగంటడంతో చేతికివచ్చిన వరిపొలాలు పశువులకు మేతగా మారాయి. దీంతో రైతుల పరిస్థితి పక్కనే సముద్రం ఉన్నా.. తాగడానికి పనికిరావు అన్నట్లుగా ఉంది.

## రైతు నవాజ్.. నారాజ్

చిలిపిచెడ్, ఏప్రిల్ 7: మండలంలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో కొన్నిచోట్లు వరి పొలాలు ఎండిపోతున్నాయి. యాసంగికి మంచి దిగుబడులు సాధిస్తామనుకున్న రైతుల ఆశలు ఆవిరయ్యాయి. చిలిపిచెడ్ మండలంలోని బండపోతుగల్ గ్రామానికి చెందిన రైతు నవాజ్ సాగుచేస్తున్న మూడెకరాల వరి పొలానికి బోరు నుంచి సరిపడా నీరురాక పూర్తిగా ఎండిపోయింది. పెట్టుబడికి పెట్టిన ఖర్చులు రాకపోవడంతో రైతు నవాజ్ తన పొలంలో కన్నీటి పర్యంతమయ్యాడు. పొలం పూర్తిగా ఎండిపోవడంతో పశువులకు మేతగా మారిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



బండపోతుగల్‌లో తన పొలంలో రైతు నవాజ్